## క్లుప్తంగా

### బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌ను సన్మానించిన సిబ్బంది

**కొలిమిగుండ్ల:** తహసీల్దార్‌గా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ బాలఈశ్వరరెడ్డి అమరావతి సీసీ ఎల్‌కు బదిలీ చేసిన ఉన్నతాధికారులు.. ఆయన స్థానంలో ఉయ్యాలవాడ తహసీల్దార్ శ్రీనివాసులును నియమించారు. దీంతో ఆయన బాధ్యతలకు చేట్టారు. నూతన తహసీ లోద్‌ర్‌కు సిబ్బంది స్వాగతం పలికారు.

### రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



ఆర్డీఓను కలిసిన తహసీల్దార్ రవికుమార్

**డోన్ టౌన్ :** రైతుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. డోన్ మండల నూతన తహసీల్దార్‌గా రవికుమార్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన చాగలమర్రి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న నాగమణి శిరివెళ్లకు బదిలీపై వెళ్లారు. బాధ్యతల స్వీకరించిన అనంతరం ఆర్డీఓ నరసింహులును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్థానిక కార్యాలయంలో ఆయనను డిప్యూటీ తహసీల్దార్ సునీల్, ఆర్ఐ మస్తాన్, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, మండల సర్వేయర్ జగదీష్ తదితరులు అభినందించారు.

### భూ సమస్యల పరిష్కారానికి కృషి



తహసీల్దార్ నాగమణికి అభినందనలు తెలుపుతున్న డీటీ, వీఆర్వోలు

**బేతంచెర్ల :** రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బేతంచెర్ల మండల నూతన తహసీల్దార్ నాగమణి అన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన బదిలీల్లో బేతంచెర్ల తహసీల్దార్ ప్రకాశ్ బాబు కృష్ణగిరి మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో డోన్‌లో విధులు నిర్వహిస్తున్న నాగమణి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ మారుతి, ఆర్ఐ హేమంత్ రెడ్డి, వీఆర్వోలు నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే బనగానపల్లె మండలం నుంచి బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి బాధ్యతలు చేపట్టారు.

### వేతనాలు చెల్లించాలి

**కోవెలకుంట్ల:** పెండింగ్‌లో వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 12 నెలలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఒప్పంద అధ్యాపకుల కొనసాగింపును రెన్యువల్ చేయాలన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో రెమిడియల్ తరగతులు, సప్లిమెంటరీ పరీక్షలు, పేపర్ మూల్యాంకనం, అడ్మిషన్ల డ్రైవ్ నిర్వహణలో విధులు నిర్వర్తించామని, అందుకు సంబంధించి మే నెల వేతనాన్ని కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్

**డోన్ టౌన్ :** పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న భవనంలోకి త్వరలో మారబోతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా రిజిస్ట్రార్ జానకిదేవి పరిశీలించారు. పలు ప్రజా సంఘాల నాయకులు, డాక్యుమెంట్ రైటర్లు, ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అక్కడకు మార్చ వద్దని, పట్టణంలోని షాదీఖానా వద్ద నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చాలన్న వినతుల మేరకు పరిశీలనకు వచ్చారు. డోన్ సబ్ రిజిస్ట్రార్ మహబూబ్‌బాషా ఉన్నారు.

### నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

**సంజామల:** మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గాధంశెట్టి వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందిస్తామన్నారు.

## సాగుకు సమాయత్తం..

# కొరవడిన సాయం

- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- సహకారమందించని ప్రభుత్వం
- సబ్సిడీ విత్తనాల పంపిణీపై కొరవడిన స్పష్టత
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సమయానికి సబ్సిడీ ఎరువులు, విత్తనాల పంపిణీ



విత్తనం వేసేందుకు పొలాన్ని సిద్ధం చేసిన దృశ్యం

**ప్యాపిలి:** ప్రతి సంవత్సరం రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ప్రకృతి సహకరించి, మంచి దిగుబడులు, గిట్టుబాటు ధరలు లభిస్తే రైతుకు అంతకు మించిన ఆనందం ఉండదు. ప్రతి ఏటా ఏదో ఒక రూపంలో నష్టపోతున్న రైతన్న మరోసారి ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నాడు. ఈ ఏడాదైనా అన్ని అనుకూలించి గిట్టుబాటు ధరలు లభిస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఇప్పటికే రైతులు తమ పొలాలను విత్తుకు సిద్ధం చేసుకున్నారు. అయితే ప్రభుత్వం ఎలాంటి సహకారం లభించకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. సబ్సిడీ విత్తనాల పంపిణీపై స్పష్టత కొరవడంతో రైతులు అయోమయంలో పడ్డారు.

#### 21 వేల హెక్టార్ల సాగు

మండలంలో మొత్తం 21 వేల హెక్టార్ల సాగు భూమి ఉంది. గతేడాది ఎక్కువగా కంది, వేరుశనగ, పత్తి తదితర పంటలు సాగు చేశారు. గతేడాది పత్తి ధర ఆశాజనకంగా ఉండటంతో ఈ సారి పత్తి సాగు పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

#### రైతుల ముంగిటకే సబ్సిడీ విత్తనాలు

2019 వ సంవత్సరానికి పూర్వం సబ్సిడీ విత్తనాల పంపిణీ ఒక ప్రహసనంగా సాగేది. మండలానికి చెందిన రైతులందరికీ విత్తన పంపిణీ మండల కేంద్రంలోనే జరిపేవారు. దీంతో సుదూర గ్రామాల రైతులు అత్యంత వ్యయప్రయాసలతో సబ్సిడీ విత్తనాలను వాహనాల్లో తమ గ్రామాలకు తీసుకెళ్లేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామస్వరాజ్య సాధనలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలు ఈ కేంద్రాల ద్వారా రైతుల ముంగిటకే తీసుకువచ్చారు. సబ్సిడీ విత్తనాల పంపిణీ, ఎరువుల పంపిణీ కూడా ఈ కేంద్రాల ద్వారానే జరిగేది. దీంతో రైతులకు వ్యయప్రయాసలతో పాటు సమయం కూడా ఆదా అయ్యేది.

#### సబ్సిడీ విత్తనాల పంపిణీ ఎప్పుడో..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఖరీఫ్ ప్రారంభం నాటికే అప్పటి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ విత్తనాలు సిద్ధంగా ఉంచేది. వర్షం ఎప్పుడు వచ్చినా విత్తనం వేసకునేందుకు రైతులు ముందుగానే సబ్సిడీ విత్తనాలు కొనుగోలు చేసి ఇళ్లలో సిద్ధంగా ఉంచుకునేవారు. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల పేరును ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్చడం తప్ప రైతులకు అందుతున్న సేవలు మాత్రం శూన్యం. ఖరీఫ్ ప్రారంభం అయినప్పటికీ సబ్సిడీ విత్తనాల పంపిణీపై స్పష్టత లేదు. మండలానికి 1000 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు కావాలని ప్రతిపాదనలు పంపగా జిల్లా అధికారులు కేవలం 500 క్వింటాళ్లు మాత్రమే కేటాయించినట్లు సమాచారం. విత్తనాలు అరకొరగా పంపిస్తే పంపిణీ ఎలా చేయాలనేది వ్యవసాయాధికారుల ముందు ఉన్న సమస్య.

#### రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం



సబ్సిడీ విత్తనాల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా అధికారులు ఇచ్చిన అలాట్‌మెంట్ మేరకు పంపిణీ చేస్తాం. ముందుగా రైతుల నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించాం. ఇది ముగిసిన వెంటనే రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తన పంపిణీ చేపడతాం. జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే సబ్సిడీ పోను రైతులు ఎంత చెల్లించాలనే వివరాలు కూడా వెల్లడిస్తాము.

– రాజేశ్, వ్యవసాయాధికారి

### సకాలంలో సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి

**డోన్ టౌన్ :** రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను సకాలంలో అందించాలని సీపీఐ జిల్లా నాయకులు సుంకయ్య, మండల, పట్టణ కార్యదర్శులు నారాయణ, మోటా రాముడుతో పాటు పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని రైతులు సాగుకు సన్నద్ధమయ్యారన్నారు.

అయితే సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ నగదు కూడా అందించలేదన్నారు.

### అభివృద్ధి పనులకు పూజలు

**డోన్ టౌన్:** మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మౌలికవసతుల కల్పనలో భాగంగా మంజూరైన రూ.255.50లక్షలకు సంబంధించిన పనులకు ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి బుధవారం భూమిపూజలు చేసి పనులు ప్రారంభించారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పరి రాధమ్మ ఆర్డీఓ నరసింహులుతో పాటు విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ గౌతమి

**డోన్ టౌన్:** పెరుగుతున్న నేరాల పట్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా మహిళా పోలీసు స్టేషన్ సీఐ గౌతమి, రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ మమత సూచించారు. బుధవారం మండల పరిధిలోని చిన్న మల్కాపురం గ్రామ ప్రజలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సెల్ ఫోన్లలో తెలియని లింక్‌లపై క్లిక్ చేయరాదని, అపరిచితులతో చాటింగ్ చేయకూడదని, ముఖ్యంగా మహిళలు, బాలికలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కిషోర బాలికలు కౌమార దశ గురించి తెలుసుకోవాలని తల్లులు వారి పిల్లలకు మంచి చెడు గురించి తెలియజేయాలని సూచించారు. ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో మరో మూడు చోట్ల మరుగుదొడ్లు



కేవీఎస్ పార్క్‌లో స్థల పరిశీలన చేస్తున్న రాజేష్ తదితరులు

**డోన్ టౌన్ :** ప్రజల సౌకర్యార్థం పట్టణంలో మరో మూడు మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని కేవీఎస్ పార్క్‌లో టాయిలెట్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా డోన్ మున్సిపాలిటీలో మూడు టాయిలెట్ల నిర్మాణం కోసం రూ. 25లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఐటీఐ వద్ద, అన్నా క్యాంటీన్ సమీపంలోని పార్కులో, కేవీఎస్ పార్కులో మూడు చోట్ల టాయిలెట్లు నిర్మిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈయన వెంట డీఈ రఘు, ఏఈ సురేష్, కాంట్రాక్టరు సీమ సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సేవలకు సన్మానం

- గతంలో పని చేసిన ఉపాధ్యాయుడిని గ్రామానికి పిలిపించి సన్మానించిన బి.తాడిపత్రి ప్రజలు



రత్నమయ్య దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

**కొలిమిగుండ్ల:** గతంలో తమ గ్రామంలోని పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును బి.తాడిపత్రి గ్రామస్తులు బుధవారం సన్మానించారు. తాటిచెర్ల రత్నమయ్య 1990 నుంచి 1998 వరకు బి.తాడిపత్రిలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. అప్పట్లో పాఠశాల భవనం లేకున్నా ఆలయంలో విద్యార్థులకు పాఠాలు చెబుతూ వచ్చాడు. తల్లితండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి వచ్చేలా ఒప్పించాడు. గ్రామస్తులకు సామాజిక సేవతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత వివిధ గ్రామాల్లో పని చేసి గత నెల 31న దొర్నిపాడు మండలం హరివరం పాఠశాలలో పనిచేస్తూ రిటైర్ అయ్యారు. విషయం తెలుసుకున్న బి.తాడిపత్రి గ్రామస్తులు రత్నమయ్య, విజయదుర్గ దంపతులను గ్రామానికి పిలిపించి సన్మానించుకుని ఆనాటి ఆయన సేవలను కొనియాడారు. గ్రామంలో ఊరేగించారు. కాగా గ్రామస్తుల ఆదరాభిమానాలు మరువలేనివని రత్నమయ్య అన్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి



వేడుకల్లో వ్యవసాయాధికారులు, రైతులు

**కోవెలకుంట్ల:** ఈ ఏడాది వ్యవసాయం అన్ని విధాలా కలిసి రావాలని కోరుతూ మండలంలోని కలుగొట్లలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి నిరంజన్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి లాభసాటి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర, కంది, తదితర పంటల సాగుకు సరైన అదునని, మేలైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు.

## తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



తనిఖీ చేస్తున్న అధికారులు

**కొలిమిగుండ్ల:** తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు దుకాణాదారులను హెచ్చరించారు. బుధవారం సిబ్బందితో కలిసి కొలిమిగుండ్లలో పలు దుకాణాలను తనిఖీ చేశారు. తూకాలు, కొలతల పరికరాలకు ముద్రలు వేయించుకోవాలని సూచించారు. కాలం చెల్లిన వేయింగ్ మిషన్‌లు, కొలతల పరికరాలు ఉపయోగించరాదన్నారు. వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హనుమాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జంతువులను సంరక్షించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**నంద్యాల(న్యూటౌన్):** జిల్లాలో జంతువులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జంతు సంరక్షణ సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆవులను అక్రమంగా రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా మున్సిపాలిటీల్లో సమస్యలు అడిగితెలుసుకున్నారు. జిల్లా సంరక్షణ సొసైటీకి పూర్తిగా తన మద్దతు ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరన్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్, ఏఎస్పీ మందజావళి పాల్గొన్నారు.

### 15వ వార్డులో సమస్యలు పరిష్కరించండి

**బేతంచెర్ల :** పట్టణంలోని 15 వార్డులోని అల్లా బకాష్ దర్గా, డ్రైవర్స్ కాలనీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పార్టీ నాయకులు కాలనీలను సందర్శించారు. సుమారు 15–20 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ కాలనీలో తాగునీటి సమస్యతో పాటు వీధి రహదారులు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో ముళ్ల పొదలను తొలగించి, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

### లబ్ధిదారులకు త్వరలోనే పింఛన్లు

**అవుకు:** కొత్తగా మంజూరైన పింఛన్లకు త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 77 మంది లబ్ధిదారులను గుర్తించామని, వారికి రూ.4వేల చొప్పున పింఛన్ మంజూరైందని, పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### వ్యవసాయాధికారుల నియామకం

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో పలువురి వ్యవసాయాధికారులకు స్థాన చలనం కల్పించి.. ఆయా స్థానాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన ఏఓలను నియమించారు. కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న నిరంజన్‌ను నంద్యాల జిల్లా వ్యవసాయ శిక్షణా కేంద్రానికి బదిలీ కాగా ఆ స్థానంలో సంజామల ఏఓ సుధాకర్‌రెడ్డిని నియమించారు. కొలిమిగుండ్ల ఏఓ జ్యోతిని సంజామలకు, అవుకు ఏఓ అబ్దుల్‌హక్ అనంతపురం జిల్లాకు బదిలీ కాగా ఆ స్థానంలో తంగడంచాఫాం నుంచి కలిమున్నీసాబేగం, ఉయ్యాలవాడ ఏఓ రాజేంద్రప్రసాద్‌ను ఆళ్లగడ్డ టెక్నికల్ ఏఓగా, అక్కడ టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న నాగేంద్రప్రసాద్‌ను కోవెలకుంట్ల టెక్నికల్ఏఓగా, ఉయ్యాలవాడ ఏఓగా తంగడంచాఫాం నుంచి మురళీధర్‌ను నియమిస్తూ వ్యవసాయ శాఖ కమిషన్ ఉత్తర్వులు జారీ చేశారు.

### బస్సు పాస్‌ల జారీ నిలిపివేత

**డోన్ టౌన్ :** ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు జారీ చేసే బస్ పాసులు ఈ నెల12, 13 తేదీల్లో (గురు, శుక్రవారాలు) రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ బుధవారం తెలిపారు. సెంట్రల్ బస్ పాస్ సర్వర్ నిర్వాహణ పనులు చేపట్టిన దృష్ట్యా రెండు రోజులు పాటు పాసులు జారీ చేయమని, తిరిగి 14న యథావిధిగా జారీ చేస్తామని చెప్పారు.

### 14 నుంచి స్టూడెంట్ బస్సు పాసులు

**బనగానపల్లె రూరల్:** స్టూడెంట్ బస్సులు ఈనెల 14 నుంచి ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ రవికిశోర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురు, శుక్రవారాల్లో ఇవ్వాల్సిన బస్సు పాసులు సాంకేతిక సమస్యల కారణంగా ఇవ్వలేకపోతున్నామని విద్యార్థులు గమనించాలని డీఎం కోరారు.

### 'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి

**కొలిమిగుండ్ల:** పర్యాటక కేంద్రం బెలుం గుహల ఆవరణలో 13న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డోన్ ఆర్డీఓ నరసింహుడు సూచించారు. బుధవారం మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో డీఎల్‌డీఓ నరసింహారెడ్డి, పర్యాటక శాఖాధికారి సత్యనారాయణతో కలిసి మండల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు తప్పకుండా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. వెయ్యి మందికి పైగానే జనాన్ని సిద్ధం చేయాలన్నారు. అనంతరం బెలుం గుహల ఆవరణానికి చేరుకొని ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ అబ్దుల్‌కలాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

**బనగానపల్లె:** మండలంలోని యాగంటిపల్లెలో బుధవారం పెద్దమ్మ జాతర ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు అవుకు, బనగానపల్లె మండలా కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గుండం శేషిరెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, శంకర్‌రెడ్డి, సిద్దం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి తదితరులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐలు దుగ్గిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.





పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న కాటసాని రామిరెడ్డి, జాతర పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

### గరుడ వాహనంపై బుగ్గ వేంకటేశ్వరుడు



**సంజామల:** మండల పరిధిలోని నొస్సం గ్రామంలో బుగ్గ వేంకటేశ్వరుని స్వామి బ్రహోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. పదిరోజుల పాటు జరిగే బ్రహోత్సవాల్లో భాగంగా 7వ రోజు బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత బుగ్గ వేంకటేశ్వర స్వామి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనిచ్చాడు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### నేడు స్పౌజ్ పింఛన్ల పంపిణీ

**కొలిమిగుండ్ల:** మండలానికి మంజూరైన 89 స్పౌజ్ పింఛన్లు గురువారం లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. అంకిరెడ్డిపల్లెకు 5, కనకాద్రిపల్లెకు 15, గొర్విమానుపల్లెకు 11, బెలుంకు 9, కమ్మవారిపల్లెకు 9, నందిపాడుకు 8, తిమ్మనాయినపేటకు 7, చింతలాయిపల్లెకు 6, పెట్నికోటకు 4, బిఉప్పలూరుకు 8, కొలిమిగుండ్ల 5, తోళ్లమడుగు, తుమ్మలపెంటకు ఒకటి చొప్పున మంజూరయ్యారన్నారు.

### హమ్మయ్య.. గుంత పూడ్చారు!

సాక్షి ఎఫెక్ట్



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతను పూడ్చివేస్తున్న దృశ్యం

**బనగానపల్లె:** పట్టణంలోని పెట్రోల్ బంకు సెంటర్ నుంచి ఆంజనేయస్వామి ఆలయం మీదుగా పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ఏర్పాటు చేసిన ప్రధాన రహదారిపై గుంతలు పడ్డాయి. ఇదే విషయాన్ని పాతకూరగాయల మార్కెట్ వద్ద ఏర్పడిన గుంత ప్రమాదాలకు నిలయంగా ఉందంటూ ‘సాక్షి’ ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం గుంతను పూడ్చివేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రమాదకరంగా గుంత



రోడ్డుపై ఏర్పడ్డ గుంత

**ప్యాపిలి:** ప్యాపిలి–పత్తికొండ రహదారిపై ఎస్ రంగాపురం వద్ద నడిరోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. గ్రామంలో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగునీరు వచ్చి ఈ గుంతలో నిలువ ఉంటున్నాయి. ప్రతిరోజూ ఈ మార్గం మీదుగా పదుల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. లోతుగా ఉన్న గుంతను గమనించక వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంత కనిపించకపోవడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడిన సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.